


## ప్రియురాలి కోపం ఖరీదు.... మూడు లక్షలు!

మనసైన వ్యక్తి పక్కనుంటే ఎంత దూరమైనా భారం అనిపించదు. ఇక ప్రేమించిన ప్రియురాలు పక్కనుంటే నరకానికైనా సంతోషంగా పోతామంటారు ఈనాటి కుర్రకారు. ఎంతటి రిస్క్ తీసుకోవడానికైనా వెనకాడరు. సరిగ్గా ఈనాటి యువతరానికి ప్రతినిధి లాంటి వాడు మషికో. జపాన్‌కు చెందిన జొబిస్ కజుహిసా మషికో(23) తన ప్రియురాలితో కలిసి సరదాగా టాక్సీలో షికారుకి బయలుదేరాడు. కచ్చితంగా ఎక్కడికి వెళ్లాలో వారిద్దరూ నిర్ణయించుకోకపోయినా ఓ 500 కిలోమీటర్లు సరదాగా కబుర్లు, జోక్స్ చెప్పుకుంటూ టాక్సీలో ప్రయాణించారు. అంత దూరం వెళ్లిన తరువాత ఉన్నట్లుండి ప్రియురాలికి ప్రియుడి మీద తెగ కోపం వచ్చింది. దానితో అతగాడి మీద చిర్రుబుర్రులాడి టాక్సీ దిగి చక్కాపోయింది. ప్రియురాలి ప్రవర్తనతో మనసువిరిగిపోయిన మషికో బాధతో తిరుగుముఖం పట్టాడు. చివరికి చెదిరిన మనసుతోనే ఇల్లు చేరాడు. మషికోతో గానీ, అతగాడి చెదిరిన మనస్సుతో కానీ టాక్సీ డ్రైవర్‌కి ఏమాత్రం సంబంధం లేదు కదా! తిరిగిన దూరానికి డబ్బులు చెల్లించమని మర్యాదగా అడిగాడు. ''నా ప్రియురాలు నన్ను బాధపెట్టింది. ఆ బాధతో నా మనస్సు ముక్కలు చెక్కలు అయింది. నేను నీ టాక్సీ బిల్లు చెల్లించను'' అంటూ మషికో నిష్కర్షగా చెప్పేశాడు. ఎంత అడిగినా మషికో దిగిరాకపోయేసరికి ఆ డ్రైవర్ పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు వచ్చి ముందు మర్యాదగానే టాక్సీ డ్రైవర్‌కు చెల్లించవలసిన డబ్బులు గురించి అడిగారు. వారికి కూడా మషికో అదే సమాధానం చెప్పాడట. దాంతో పోలీసులకు చిర్రెత్తుకొచ్చింది. నీ ప్రియురాలు నీ మనసు విరిచేస్తే డబ్బులు చెల్లించడానికేమయింది? అంటూ అతగాడిని శ్రీకృష్ణ జన్మస్థానానికి తరలించారు. ఇంతకీ మషికో చెల్లించాల్సిన డబ్బు ఎంత అనుకుంటున్నారు? మన ఇండియన్ కరెన్సీలో దాదాపు మూడు లక్షల రూపాయలు!

'సరసి' కత

# డబ్బబ్బాయి

వైశంపాయనుడి తోడల్లుడికి ఆ మధ్య సీరియస్ అయింది. ఆయన కొడుకు లంబోదర్ స్టేట్సులో ఉద్యోగం చేస్తున్నాడు. కడసారి చూడ్డానికి రమ్మని అతడికి కబురెళ్లింది.

''కచ్చితంగా పోయేటట్టయితేనే చెప్పండి వస్తాను. తీరా పోకపోతే, నాకూ, మా ఆవిడకీ కలిపి రెండు లక్షలు ఖర్చవుతుంది. అదెవరు తిన్నట్టూ? ఇది వరకు కూడా ఇలాగే హడావుడి పడి వస్తే, ఆయన నిక్షేపంలా ఉన్నాడు. మందులు పని చేశాయి తగ్గిపోయింది అన్నారు'' అని విసుక్కున్నాడు లంబోదర్.

''లేదు, లేదు ఈసారి పోవడం ఖాయం, మాదీ గేరంటీ'' అని వైశంపాయనుడు ష్యూరిటీ ఇచ్చాకనే బయల్దేరాడు లంబోదర్ భార్యాసమేతుడై.

కొడుక్కి కడసారి చూపన్నా దక్కించు దేవుడా అని బంధువులంతా దేవుణ్ణి మొక్కుకున్నారు.



దార్లో ఎప్పటికప్పుడు తండ్రి ఎలా ఉన్నాడని కనుక్కుంటూనే ఉన్నాడు లంబోదర్. పన్నెండు గంటల ప్రయాణం తరువాత తెలిసింది. తండ్రి కోలుకున్నాడనీ, అవుటాఫ్ డేంజరనీ.

తండ్రి ఆరోగ్యంగా ఉన్నప్పుడు అంత ఖర్చు పెట్టుకుని ఇండియాకి రావడంలో అర్థం లేదని నిర్ధారించుకుని, ఫ్లైటు మారి, వెనక్కి వెళ్లిపోయాడు లంబోదర్.

కొడుకు అలా అమెరికా చేరుకోగానే తండ్రి ఇక్కడ కన్నుమూశాడు.

*